క్లుప్తంగా...

కబ్జాదారుల నుంచి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎం.ప్రభాకర్ రెడ్డి

రాజేంద్రనగర్: ఆరాంఘర్ చౌరస్తాలో సర్వే నంబర్ 72లోని ప్రభుత్వ స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని రాజేంద్రనగర్ శివరాంపల్లి ప్రాంతానికి చెందిన ఎం.ప్రభాకర్ రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం ప్రభాకర్ రెడ్డి రాజేంద్రనగర్ మండల కార్యాలయంలో తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఆరాంఘర్ చౌరస్తాలో సర్వే నంబర్ 72 కాటేదాన్ రెవెన్యూలో సుమారుగా 600 గజాల ప్రభుత్వ స్థలాన్ని కొందరు వ్యక్తులు కబ్జా చేసి శ్రీనివాస్ బార్ అండ్ రెస్టారెంట్ వారికి కిరాయికి ఇచ్చారన్నారు. ఈ కబ్జాపై తగిన చర్యలు తీసుకొని ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరారు.

సర్పంచ్ ఆధ్వర్యంలో వీధుల శుభ్రం



శంషాబాద్ రూరల్ : మండలంలోని ననాజీపూర్ గ్రామంలో శనివారం వీధులను శుభ్రం చేశారు. స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా మేరా దేశ్ మేరా మట్టి కార్యక్రమం నిర్వహించారు. వారం రోజులుగా వివిధ రకాలుగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు సర్పంచు కల్పనసింహారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచు కృష్ణ, పంచాయతీ కార్యదర్శి రాధికరెడ్డి, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఏక్ తారీఖ్ ఏక్ గంట

మణికొండ: స్వచ్ఛతకు ప్రతి ఒక్కరు పెద్దపీట వేయాలని, మన పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే మనం ఆరోగ్యంగా జీవిస్తామని మహాత్మా గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాల ప్రిన్సిపాల్ జి.చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు శనివారం ఏక్ తారీఖ్ ఏక గంట స్వచ్ఛత కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఆదివారం ఒక గంట పాటు మన ఇంటి పరసరాల పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి ఒక్కరు శ్రమించాలన్నారు.

శంషాబాద్‌లో ప్రశాంతంగా గణపయ్యల నిమజ్జనం

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని వినాయకుల నిమజ్జనం శుక్రవారం రాత్రి ప్రారంభమై శనివారం ఉదయం వరకు కొనసాగింది. పట్టణంలో మొత్తం 190 వినాయక విగ్రహాలను కాముని చెరువులో నిమజ్జనం చేశారు. పోలీసులు, మున్సిపాలిటీ సిబ్బంది వినాయకుడి నిమజ్జన యాత్రకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. నిమజ్జనోత్సవంతో పాల్గొన్న వారికి కౌన్సిలర్ జహంగీర్‌ఖాన్ ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేసి శీతల పానియాలు.. మంచినీళ్లు అందజేసి మతసామరస్యాన్ని చాటుకున్నారు.

ఎయిర్‌పోర్టులో మహిళ అదృశ్యం



శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో మహిళ అదృశ్యమైన సంఘటన చోటు చేసుకుంది. పశ్చిమగోదావరి జిల్లా చాగల్లు మండల కేంద్రానికి చెందిన ఎర్రం శెట్టి రాజు భార్య వరలక్ష్మీ (25) కొంత కాలం కిందట బహ్రేన్‌లో హౌస్ కీపింగ్ ఉద్యోగం చేసింది. ఈ నెల 29 బహ్రేన్ నుంచి బయలుదేరిన వరలక్ష్మి ఢిల్లీ మీదుగా హైదరాబాద్‌కు చేరుకోనున్నట్లు భర్తకు చెప్పింది. వరలక్ష్మీ చేరుకోకపోవడంతో భర్త కుటుంబసభ్యులు ఆరా తీశారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు చేరుకున్న ఆమె రాకపోవడంతో శనివారం ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలి

బండ్లగూడ: విద్యార్థులకు చిన్న నాటి నుంచే పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ వారిని జాగృతి చేయాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర వెల్లడించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 స్వచ్ఛతా హీ సేవలో భాగంగా టైమ్స్ పాఠశాల, ఎస్ఎంపీ మోడల్ స్కూల్‌లో తడి, పొడి చెత్తపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ బి.శరత్‌చంద్ర మాట్లాడుతూ విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచుకొని తమ కుటుంబ సభ్యులకు వివరించాలన్నారు. చెత్తచెదారాలు, వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు తోడ్పాడాలని ఈ సందర్భంగా స్వచ్ఛతకై విద్యార్థిణి, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో టైమ్స్ పాఠశాల కరస్పాండెంట్ జయశ్రీ అగర్వాల్, ప్రిన్సిపల్ విజయసుధాకర్, ఎస్ఎంపీ మోడల్ స్కూల్ డైరెక్టర్లు శ్వేతారెడ్డి, దివ్యరెడ్డి పాల్గొన్నారు.




బొటానికల్ గార్డెన్‌లో పక్షులను వీక్షిస్తున్న పక్షి ప్రేమికులు

అరుదైన పక్షుల వీక్షణం

పక్షి ప్రేమికుల కోసం బర్డ్ వాక్

గచ్చిబౌలి: బొటానికల్ గార్డెన్‌లో అరుదైన పక్షులను పక్షి ప్రేమికులు వీక్షించారు. శనివారం కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లో తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ హైదరాబాద్ బర్డింగ్ పాల్స్ ఆధ్వర్యంలో బర్డ్‌వాక్ ఏర్పాటు చేసింది. రోజ్-రింగ్డ్ పారాకీట్, రూఫస్ ట్రీ పై, ఇండియన్‌రాబిన్, ఎల్లో-బిల్డ్ బాబ్లర్, పర్పుల్ సన్బర్డ్, భారతీయ సిల్వర్‌బిల్, ఆసియా గ్రీన్ బీ-ఈటర్, నవ్వుతున్న పావురం, మచ్చల పావురం, పైడ్బుష్చాట్, తెల్లటి బుగ్గల వాగ్ టైల్, లేత బిల్డ్ ఫ్లవర్ పేకర్ వంటి అరుదైన పక్షులను వీక్షించారు. టీఎస్ఎఫ్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్ నాయక్ మాట్లాడుతూ పక్షులను అధ్యయనం చేస్తూ 15 వేల మంది ఔత్సాహికులు అందించిన వివరాల ఆధారంగా ద స్టేట్ ఆఫ్ ఇండియాస్ బర్డ్స్ వివరాలను వెల్లడించిందన్నారు. 867 రకాల పక్షుల స్థితిగతులను అందించారని, గద్దలు, రాబందులు, పాగే పక్షులు, తీరాలకు వలస వచ్చే పక్షుల సంఖ్య అత్యధికంగా తగ్గిందని నివేదిక ఇచ్చినట్లు ఆయన తెలిపారు. పక్షుల వేట, పక్షుల అవాసాలు లేకుండా చేయడమే పక్షుల జాతులు అంతరించి పోతున్నాయని అన్నారు. నాలుగు బృందాలుగా విభజించి పక్షుల వీక్షణ ఏలా చేయాలి, వాటిని ఎలా గుర్తించాలి, అవి ఎలాంటి శబ్దాలు చేస్తాయనే విషయాలపై అవగాహన కల్పించారు. నగరంలోని పలు చోట్ల నుంచి 30 మంది, 44 మంది జంతు శాస్త్రం విద్యార్థినులు, 74 మంది పక్షి ప్రేమికులు పాల్గొన్నారు.



బొటానికల్ గార్డెన్‌లో విహరించిన అరుదైన పక్షులు

ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీసీ డైరెక్టర్ అక్బర్, ఏడీ డాక్టర్ జి.స్కైలాబ్, మేనేజర్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

హరిత విప్లవ పితామహుడికి నివాళి



స్వామినాథన్‌కు నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

ఏజీవర్సిటీ: భారత హరిత విప్లవ పితామహుడు, గొప్ప వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌కు శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అధ్యాపకులు, ప్రొఫెసర్లు, విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతు ఆయన శోధించి, పరిశోధించి రూపొందించిన వంగడాలు బంగారు పంటలను పండిచాయన్నారు. ఆయన మరణం వ్యవసాయ రంగానికి తీరని లోటని అన్నారు. ఉద్యాన విశ్వవిద్యాలయం డీన్ చీనానాయక్ ,నిఖిల్,శ్రీరాములు పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న రాజేంద్రనగర్ మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 11వ అదనపు న్యాయమూర్తి నీలిమ

అత్తాపూర్: రాజేంద్రనగర్ మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 11వ అదనపు న్యాయమూర్తి నీలిమ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును అత్తాపూర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. ఇందులో భాగంగా చట్టాలపై అవగాహన కల్పించారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వద్దని తెలిపారు. బాలికలు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా ఉన్నత చదువులు చదివి సమాజంలో ఉన్నత పదవులను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 13వ న్యాయమూర్తి అంకిత్ సర్వ, బార్ అసోసియేషన్ కార్యదర్శి రామకృష్ణ గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, ఉపాధ్యాయులు సాయి ప్రసాద్, లీగల్ హెడ్ సభ్యులు సుధాకర్ రెడ్డి, శ్రీనివాసులు, అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, కోర్టు సిబ్బంది నరేశ్ గౌడ్, యాదగిరి, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు వెంటనే పరిష్కరించాలి

బండ్లగూడ: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్స్ అధ్యక్షురాలు కె.సునీత అన్నారు. సెప్టెంబర్ 11వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గు చేటన్నారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్ అండ్ హెల్పర్స్ యూనియన్స్ జాయింట్ యాక్షన్ కమిటి సిఐటియూ-ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ ఆరెమైసమ్మ చౌరస్తలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి కె.సునీత హజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సుమారు 70 వేల మంది అంగన్‌వాడీ ఉద్యోగులు పని చేస్తున్నారన్నారు. వీరంతా మహిళలు బడుగు, బలహీనవర్గాలకు చెందిన వారే ఎక్కువ మంది ఉన్నారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్, కార్మికులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పన్నీర్ కర్రీలో పురుగులు



ఖానాపూర్ బార్, రెస్టారెంట్‌లో తనిఖీలు చేస్తున్న మున్సిపల్ అధికారులు

మణికొండ: ఓ బార్, అండ్ రెస్టారెంట్ నుంచి తీసుకుని వెళ్లిన పన్నీర్ మసాలా కర్రీలో పురుగులు రావటం, అది గమనించకుండా పిల్లలు తినటంతో అస్వస్థతకు గురయిన సంఘటన నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో జరిగింది. అదే గ్రామానికి చెందిన దుద్దాల విఠల్ శుక్రవారం రాత్రి స్థానిక సీక్రేట్స్ బార్, రెస్టారెంట్ నుంచి బటర్ నాన్ రొట్టెలు, పన్నీర్ మసాల కర్రీ తీసుకుని ఇంటికి వెళ్లాక చూసుకోకుండా పిల్లలు తిని వాంతులు చేసుకున్నారు. ఎందుకు అని పరిశీలించి చూస్తే అందులో తెల్ల పురుగులు ఉండటాన్ని గమనించారు. దాన్ని అలాగే ఉంచి శనివారం హోటల్ వారికి చూయించి నిలదీసి, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దాంతో డీఈ నరసింహారాజు, మేనేజర్ యోగేష్, టీపీఎస్ పావని, ఏఈ శ్రీనివాస్, సానిటేషన్ ఇంచార్జి లచ్చిరాంలు తనిఖీలు చేశారు.

జరిమాన విధించాం: కమీషనర్

ఖానాపూర్ గ్రామంలోని బార్, రెస్టారెంట్‌లో తీసుకున్న కర్రీలో పురుగులు వచ్చాయని విఠల్ అనే వ్యక్తి ఫిర్యాదు చేయటంతో తమ అధికారుల బృందం తనిఖీలు నిర్వహించిందని మున్సిపల్ కమీషనర్ సురేందర్‌రెడ్డి తెలిపారు. తాము వెళ్లిన సమయంలో రెస్టారెంట్‌లో చెడిపోయినవి ఎలాంటి వస్తువులు లభించలేదని, కిచెన్‌లో అపరిశుభ్రంగా ఉండటంతో రూ.10వేల జరిమాన విధించామన్నారు. ఆహారాన్ని అందిస్తున్న హోటల్‌లు, రెస్టారెంట్‌లలో పరిశుభ్రంగా లేకపోయినా, నాణ్యత లోపించినా 9121526917 నెంబరుకు ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. తరచూ తనిఖీలు చేసేందుకు ఐదు మందితో కమిటీని వేశామని ఆయన వివరించారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం

బండ్లగూడ: రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి పరుస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తున్నామని ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలుప ప్రాంతాలలో రూ.6.51 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్‌తో కలిసి రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ హాజరై ప్రారంభించారు. కార్యక్రమలో మున్సిపల్ కమీషనర్ శరత్‌చంద్ర, డిప్యూటీ మేయర్ పి.రాజేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు గోకరి సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



బాబుగురుస్వామి(ఫైల్)

శంషాబాద్: శంషాబాద్‌లో అయ్యప్పభక్తుడిగా గత ఇరవై ఏళ్లుగా పూజలు నిర్వహిస్తూ అయ్యప్పమాలధారులు గురుస్వామిగా మార్గదర్శనం చేస్తున్న బాబు గురుస్వామి (54) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. శుక్రవారం అర్ధరాత్రి ప్రారంభమైన పట్టణంలోని వినాయక నిమజ్జనం సందర్భంగా వివిధ పూజల్లో పాల్గొన్న ఆయన తెల్లవారుజాము సాతంరాయిలో ఉన్న ఇంటికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. మల్లికా కన్వెన్షన్ సమీపంలో ఆయన హోండా యాక్టివా వాహనం జారిపోవడంతో ఆయన నేరుగా పక్కనే ఉన్న డివైడర్‌పై పడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయం కావడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులకు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ స్థాయిలో సత్తాచాటుతాం

- జాతీయ స్థాయిలో సత్తాచాటుతాం
- మిసెస్ ఇండియా తెలంగాణ మమతా త్రివేది

మణికొండ: వివాహిత మహిళల కొరకు అతిపెద్ద వేదిక అయిన మిసెస్ ఇండియా-2023లో సత్తాచాటి పథకాలను సాధిస్తామని మిసెస్ ఇండియా తెలంగాణ మమతా త్రివేది అన్నారు. శనివారం సాయంత్రం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ల్యాంకోహిల్స్‌లో ఇటీవల మిసెస్ తెలంగాణ 2023 పోటీలలో విజేతలుగా నిలిచిన మహిళలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ స్థాయిలో తమ సత్తా చటామని, డిసెంబర్‌లో నిర్వహించే జాతీయ పోటీలలోను పాల్గొని పథకాలను సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం లభించటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఫ్యాషన్ షోలో రాంప్‌పై క్యాట్ వాక్ చేసి అబ్బుర పరిచారు. ఈ కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల అందెగత్తెలు పాల్గొన్నారు.



జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనే మిసెస్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు

కుష్ఠువ్యాధిపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎంఎంహెచ్ఓ అధికారులు, లెప్రసి నోడల్ ఆఫీసర్ రవీందర్ రెడ్డి

అత్తాపూర్: శివరాంపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హజరైన డీఎంఎంహెచ్ఓ అధికారులు, లెప్రసి నోడల్ ఆఫీసర్ రవీందర్ రెడ్డి పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వ్యాధి నిర్ధారణ, చికిత్సలు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా నిర్వహిస్తారన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిషన్ నాక్, ఉపాధ్యాయులు విక్రం రెడ్డి, అమృత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంజీఐటీలో ఆర్‌డీసీ సదస్సు

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాలలో రీసెర్చ్, డెవలప్‌మెంట్ కమిటీ (ఆర్‌డీసీ) ఆధ్వర్యంలో పరిశధన చేయటానికి డీఆర్‌డీఓ కు సంబంధించిన అందుబాటులో ఉన్న 'పరిశోదన పథకాలు' అనే అంశంపై శనివారం ఒక రోజు సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ సైంటిస్ట్ డాక్టర్ ఆర్. శంకర సుబ్రమణ్యన్ పాల్గొన్నారు. డీఆర్‌డీఓలోని పరిశోధన ప్రయోగశాలల గురించి వివిధ పథకాల గురించి, నిపుణుల అంచనా స్థాయిలో పరిశోదన ప్రతి పాదనలను రాసే పద్దతులను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి, కళాశాల ఆర్‌డీసీ డైరెక్టర్ డాక్టర్ ఫణిరాజ్, అధ్యాపకులు, చివరి సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న శంకర సుబ్రమణ్యన్

గోల్కొండ రిసార్ట్సులో పాకిస్థాన్ క్రికెట్ జట్టు



గోల్కొండ టవర్ రెస్టారెంట్‌లో బోజనానికి వచ్చిన పాకిస్థాన్ క్రికెట్ జట్టు

మణికొండ: పాకిస్థాన్, న్యూజిలాండ్ మధ్య ఉప్పల్ వేదికగా జరిగిన వామప్ మ్యాచ్‌కు హైదరాబాద్ వచ్చిన పాకిస్థాన్ క్రికెట్ కెప్టెన్ బాబర్ ఆజమ్‌తో పాటు జట్టు సభ్యులు శనివారం రాత్రి హైదరాబాద్ నగర శివారు గండిపేటలోని గోల్కొండ రిసార్ట్‌కు వచ్చారు. వారిని రిసార్ట్ యాజమాన్యం సాదరంగా ఆహ్వానించారు. హైదరాబాద్ మటన్ దమ్ బిర్యానీతో పాటు పత్తర్‌కా ఘోష్, గల్లెటికీ కబాబ్, రాణి నిజామీ, అనూఖీ ఖీర్‌లను ఇష్టంగా తిన్నారు. అనంతరం హైదరాబాద్ వంటకాలు, ముఖ్యంగా బిర్యానీలకు ప్రపంచ ప్రఖ్యాతి ఉందని, వాటిని ఈరోజు ఇష్టంగా తినటం ఆనందంగా ఉందని రిసార్ట్స్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డితో పేర్కొన్నారు.

వ్యర్థాలను వినియోగించాలి



చెత్తలో వచ్చిన వాటితో తిరిగి తయారు చేసిన వస్తువులను చూపుతున్న పమేలా సత్పతి

మణికొండ: అనుదినం ప్రతి ఇంటి నుంచి వస్తున్న వ్యర్థాలను వినియోగించి అనేక నూతన వస్తువులను తయారు చేసి తిరిగి వినియోగిస్తే చెత్త ఉత్పత్తిని తగ్గించవచ్చని రాష్ట్ర కమీషనర్, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్(సీడీఎంఏ) పమేలా సత్పతి అన్నారు. శనివారం ఆమె గండిపేట మండలం వట్టినాగులపల్లిలో ఉన్న మణికొండ, నార్సింగి మున్సిపాలిటీ చెత్త డంపింగ్, ట్రాన్స్‌ఫర్ స్టేషన్, సేంద్రీయ ఎరువుల తయారీ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్తలు, వ్యర్థ పదార్థాలను తిరిగి వినియోగంలోకి తెస్తున్న పద్ధతులను కమీషనర్‌లు కె. ఫల్గుణ్‌కుమార్, బి. సురేందర్‌రెడ్డిలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనం తిరిగి వినియోగించగలిగే ఎన్నో వస్తువులను వృథాగా పడవేస్తున్నామని, వాటిని తిరిగి కొత్త వస్తువుగా మారిస్తే అందరు అబ్బురప డతారన్నారు. పనికి రాని వస్తువులను తిరిగి వినియోగంలోకి తేవటంతో విద్యార్థులలోను సృజనాత్మకత శక్తి పెరుగుతుందన్నారు. ఇప్పటికే కొందరు పిల్లలు తయారు చేసిన పరీక్ష ప్యాడ్‌లు, గోడ గడియారం, ఫ్లవర్ వాజ్‌లను చూసి ఆమె ప్రత్యేకంగా అభినందించి వాటిని విద్యార్థులకు బహుమతులుగా అందజేశారు. కార్యక్రమంలో మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, త్రివేణి పాఠశాలల విద్యార్థులు తడి, పొడి చెత్త వేరు చేయాల్సిన అవసరం, పర్యావరణం, పరిశుభ్రత, పనికి రాని వస్తువులను తిరిగి వినియోగించేలా తయారు చేయటం అవసరాలపై మాట్లాడారు.

నేడు ట్రాఫిక్ మళ్లింపు



చార్మినార్: మిలాద్-ఉన్-నబీ ఉత్సవాలను పురస్కరించుకొని పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ దారి మళ్లింపు ఉంటుందని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ సూచించారు. ఈ ట్రాఫిక్ దారి మళ్లింపు ఆదివారం ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుందన్నారు.

- సయ్యద్ ఖాద్రీ చమన్, గులాం ముర్తుజా కాలనీ నుంచి ఊరేగింపు ప్రారంభమైనప్పుడు షంషీర్ గంజ్, ఇంజన్‌బౌలి ప్రాంతాల నుంచి వాహనాలను అనుమతించకుండా మహబూబ్‌నగర్ ఎక్స్ రోడ్డు, కందికల్‌గేట్, పిసల్‌బండ, పాత కర్నూల్ రోడ్డు దారి మళ్లించనున్నామన్నారు.
- ఊరేగింపు సయ్యద్ ఖాద్రీ చమన్, గులాం ముర్తుజా కాలనీ చేరుకున్నప్పుడు 15 నిమిషాల ముందు ట్రాఫిక్ గోశాల వద్ద మళ్లించబడుతుందన్నారు. షంషీర్‌గంజ్, ఇంజన్‌బౌలి వైపు ట్రాఫిక్ అనుమతించరన్నారు. బహదూర్‌పురా నుంచి కాలాపత్తర్ వైపు వచ్చే ట్రాఫిక్‌ను అనుమతించకుండా కాలాపత్తర్ వై జంక్షన్ వద్ద అలీనగర్, జహనుమా వైపు దారి మళ్లించనున్నామన్నారు.
- ప్రధాన ఊరేగింపు టెయిల్ ఎండ్ ఇంజన్‌బౌలి చేరుకున్నప్పుడు మహబూబ్‌నగర్ ఎక్స్ రోడ్డు నుండి ట్రాఫిక్ విడుదల చేయబడుతుందని..అదే ఇంజన్‌బౌలి వద్ద గోశాల వైపు, అలాగే సయ్యద్ ఖాద్రీ చమన్ రోడ్డు వైపు మళ్లించబడుతుందన్నారు. ట్రాఫిక్ నాగులచింత, చార్మినార్ వైపు అనుమతి ఉండదన్నారు.
- ఊరేగింపు షంషీర్‌గంజ్‌కు చేరుకున్నప్పుడు ట్రాఫిక్ షంషీర్‌గంజ్ వద్ద మళ్లించబడుతుందని.. ఊరేగింపు వెనుక చార్మినార్ వైపు అనుమతించకుండా గోశాల, కాలాపత్తర్, బహదూర్‌పురా ప్రాంతం వైపు మళ్లించబడుతుందన్నారు.
- ఊరేగింపు షంషీర్‌గంజ్‌కు చేరుకున్నప్పుడు లాల్‌దర్వాజా మోడ్ నుంచి ట్రాఫిక్ అనుమతించకుండా లాల్‌దర్వాజా, ఛత్రినాక వైపు దారి మళ్లించనున్నామన్నారు.
- ఊరేగింపు లాల్‌దర్వాజా మోడ్‌కు చేరుకున్నప్పుడు డెక్కన్ హోటల్, అక్కన్న మాదన్న ఆలయం, అశోక్ స్తంభం, మహ్మద్ షకూర్ మసీదు మీదుగా సుధా లైబ్రేరి వైపు దారి మళ్లించనున్నామన్నారు.
- ఊరేగింపు టెయిల్ ఎండ్ లాల్‌దర్వాజా మోడ్‌కు చేరుకున్నప్పుడు ఊరేగింపు వెనుక నాగులచింత వద్ద ట్రాఫిక్ మూసి వేయబడుతుందని.. సుధా లైబ్రేరీ, అశోక్ పిల్లర్, మహ్మద్ షకూర్ మసీదు వైపు దారి మళ్లించబడుతుందన్నారు.
- ఊరేగింపు లాల్‌దర్వాజా మోడ్‌కు చేరుకున్నప్పుడు హిమ్మత్‌పురా, రాజేశ్ మెడికల్ హాల్ వద్ద ట్రాఫిక్ మూసి వేయబడుతుందని.. అక్కన్న మాదన్న ఆలయం, ఓల్గా హోటల్, ఖిల్వత్ వైపు దారి మళ్లించనున్నామన్నారు.
- ఊరేగింపు లాల్‌దర్వాజా మోడ్‌కు చేరుకున్నప్పుడు ఫతేదర్వాజా నుంచి ఖిల్వత్ నుంచి రాజేశ్ మెడికల్ ఋూల్/హిమ్మత్‌పురా వైపు ట్రాఫిక్ అనుమతించబడదన్నారు. ఓల్గా హోటల్ వద్ద ఫతేదర్వాజా, ఖిల్వత్ వైపు దారి మళ్లించనున్నామన్నారు.
- ఊరేగింపు రాజేశ్ మెడికల్ హాల్, శాలిబండకు చేరుకున్నప్పుడు పంచమోహల్లా వద్ద ట్రాఫిక్ అనుమతించబడదని.. షా ఫంక్షన్ హాల్ వద్ద ఖిల్వత్ రోడ్డు వైపు దారి మళ్లించనున్నామన్నారు.
- ఊరేగింపు నారాయణ స్కూల్ (చార్మినార్)కి చేరుకున్నప్పుడు ట్రాఫిక్ చార్మినార్ వైపు అనుమతించకుండా రాజేశ్ మెడికల్ హాల్ వద్ద నుంచి ఖిల్వత్, అక్కన్న మాదన్న దేవాలయం, మొగల్‌పురా వైపు దారి మళ్లించనున్నామన్నారు.
- ఊరేగింపు మక్కా మసీదు నుంచి వెళ్లినప్పుడు కాలికమాన్ నుంచి గుల్జార్‌హౌజ్ వైపు ట్రాఫిక్ అనుమతించకుండా అర్మాన్ హోటల్ వద్ద ఎతేబార్ చౌక్ వైపు మళ్లించబడుతుందన్నారు. మరోవైపు షేర్ బాతిల్ కమాన్ (ఘాన్సీబజార్) నుంచి వచ్చే ట్రాఫిక్‌ను గుల్జార్‌హౌజ్ వైపు అనుమతించకుండా షేర్ బాతిల్ కమాన్ కింద మిట్టికా షేర్, ఘాన్సీబజార్ వైపు దారి మళ్లించనున్నామన్నారు.
- ఊరేగింపు చార్‌కమాన్ చేరుకున్నప్పుడు మదీనా నుంచి చార్మినార్ వైపు వచ్చే ట్రాఫిక్‌ను అనుమతించకుండా మదీనా వద్ద సిటీ కాలేజీ వైపు దారి మళ్లించనున్నామన్నారు.
- ఊరేగింపు చార్‌కమాన్ చేరుకున్నప్పుడు షెర్టన్ హోటల్ లేన్ నుంచి వచ్చే ట్రాఫిక్‌ను ప్రధాన రహదారి అంటే మచిలీకమాన్‌లోకి అనుమతి ఉండదన్నారు. అదే సమయంలో అగర్వాల్ కమాన్ నుంచి వచ్చే ట్రాఫిక్ అగర్వాల్ కమాన్ వద్ద నిలిచిపోతుందన్నారు.
- టెయిల్ ఎండ్ గులాజర్‌హౌజ్‌కు చేరుకున్నప్పుడు కాలికమాన్, ఎతేబార్‌చౌక్, షేర్ బాతిల్ కమాన్ (ఘాన్సీబజార్) వైపు ట్రాఫిక్ అనుమతించబడుతుందని.. మదీనా వైపు అనుమతి ఉండదన్నారు.
- ఊరేగింపు మచిలికమాన్‌కు చేరుకున్నప్పుడు ఎంఎం సెంటర్ వద్ద ట్రాఫిక్ మూసి వేయబడుతుందని.. అఫ్జల్‌గంజ్ వంతెన వద్ద దారి మళ్లించబడుతుందన్నారు.
- ఊరేగింపు పిస్తాహౌజ్‌కు చేరుకున్నప్పుడు అక్కన్న మాదన్న ఆలయం నుంచి మొఘల్‌పురా, బీబీబజార్ వైపు ట్రాఫిక్ అనుమతి ఉండదన్నారు. హఫీజ్‌డంకా మసీదు, అశోక్ పిల్లర్, రాజేశ్ మెడికల్ హాల్ వైపు దారి మళ్లించబడుతుందన్నారు. మరోవైపు మొఘల్‌పురా నుంచి వచ్చే ట్రాఫిక్‌ను మీర్‌కా దాయారా నుంచి మొఘల్‌పురా వైపుగా గౌలిపురా రోడ్డు మీదుగా ఊరేగింపు ముగిసే వరకు దారి మళ్లిస్తారన్నారు.
- ఊరేగింపు బీబీబజార్‌కు చేరుకున్నప్పుడు ఊరేగింపు ముగిసే వరకు ట్రాఫిక్‌ను మొఘల్‌పురా వాటర్ ట్యాంక్ రోడ్డు వైపు మళ్లించే వరకు.. తలాబ్‌కట్టా నుంచి ఓల్గా హోటల్‌కు ట్రాఫిక్ అనుమతి ఉండదన్నారు.